
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
19 ఆగష్టు 2026
పేజీలు : 8




**నల్లగొండ, ఆగస్టు 18 (జనం సాక్షి)**

నల్లగొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ)లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ జిల్లా స్థాయి అధికారిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు, ప్రజాప్రతినిధుల సూచనలు, న్యాయస్థానాల ఆదేశాల అమలులో అధికారి వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగ, రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఆరోపణలపై సంబంధిత అధికారి వివరణ ఇవ్వాల్సి ఉంది.

**సస్పెన్షన్ ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యంపై షోకాజ్**

సస్పెన్షన్ ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం చేశారన్న అంశంపై హైకోర్టు నుంచి సదరు అధికారికి షోకాజ్ నోటీసు జారీ అయినట్లు సమాచారం. ఈ నెల 18న వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో డీఆర్డీఏలో అధికారుల తీరుపై తీవ్ర చర్చ మొదలైంది.

**ఎస్సీ ఉద్యోగుల విషయంలో కఠిన వైఖరి..**

ముగ్గురు ఎస్సీ ఉద్యోగులను చిన్నచిన్న కారణాలతో సస్పెండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇదే అధికారి.. మర్రిగూడ మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలిగా సుమారు 18 ఏళ్లుగా కొనసాగుతున్న మహిళను మాత్రం పదవి నుంచి తొలగించకుండా కొనసాగించాలని ఏపీఎంకు ఆదేశించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**18 ఏళ్లుగా ఒకే వ్యక్తి.. మళ్లీ కొనసాగింపా?**

గ్రామ సంఘాల పదవులకు రొటేషన్, కాలపరిమితి వంటి నిబంధనలు ఉంటే, సుమారు 18 ఏళ్లుగా ఒకే వ్యక్తి కొనసాగడంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. సదరు మహిళ సామాజిక వర్గాన్ని ప్రస్తావిస్తూ వస్తున్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరగాలని పలువురు కోరుతున్నారు. ఒకవైపు ఎస్సీ ఉద్యోగులపై కఠిన చర్యలు.. మరోవైపు సుదీర్ఘకాలంగా ఒకే వ్యక్తికి కొనసాగింపు కల్పించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**ఎమ్మెల్యేల సూచనలకూ విలువ లేదా?**

మంత్రి అండదండలతోనే అధికారి తన నిర్ణయాలను అమలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల సూచనలను సైతం పక్కనపెట్టి వ్యవహరిస్తున్నా రన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో, జిల్లా స్థాయి అధికారి ఇంతటి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవడానికి కారణమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

హైకోర్టు షోకాజ్ నోటీసు, ఎస్సీ ఉద్యోగుల సస్పెన్షన్లు, పదోన్నతులపై ఆరోపణలు, ఎర్రగండ్లపల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలి కొనసాగింపు, పదవుల కేటాయింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటపటిమను
# ఆదర్శంగా తీసుకోవాలి
### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట (జనంసాక్షి):**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటపటిమను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే కాకుండా ప్రజలలో పోరాట పటిమపై దశ, దిశ, నిర్దేశం చేస్తూ వారికి న్యాయం చేసేందుకు కృషి చేశారని అన్నారు. సర్వాయి పాపన్న అట్టడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సమస్యలపై దృష్టి పెట్టి సమాజంలో వెలుగు నింపాలని, ప్రజలలో ప్రేరణ తీసుకొచ్చి సమాజంలో మార్పులు తీసుకురావాలని అన్నారు.అందుకు చదువు ఒకటే పరిష్కారమని అన్నారు.చదువు ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, కొత్త తరానికి ఒక బలమైన జీవితాన్ని ఇవ్వడానికి కృషి చేయాలని కోరారు.వివిధ అభివృద్ధి పనులు, శాఖల వారి పనులు, విద్య ఆరోగ్యం మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, సర్దార్ సర్వాయి పాపన్న చేసిన మంచి పనులను స్ఫూర్తిగా తీసుకుని పిల్లలకు చెప్పి వారిలో స్ఫూర్తి నింపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఎస్సీ సంక్షేమ అధికారి లత, టిఎన్జీవో జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,బీసీ సంఘం నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనం సాక్షి కథనానికి స్పందన
# గుంత పూడ్చివేత

**వలిగొండ, ఆగస్టు 18 (జనంసాక్షి)**

మండలంలోని నాగారం బట్టి మైసమ్మ ఆలయం సమీపంలో రహదారి గుంతగా ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని ఈ నెల 11న జనం సాక్షి పత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించారు.కథనం ద్వారా సమస్య వెలుగులోకి రావడంతో సంబంధిత వారు చర్యలు చేపట్టి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలకు ప్రమాదం తప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన జనం సాక్షి కథనానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.





## బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న
### జిల్లా ఎస్పీ నరసింహ

**తుంగతుర్తి ఆగస్టు 18 (జనంసాక్షి)**

బహుజనుల ఆత్మగౌరవం కోసం అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు,

మిగతా 9లో

## భద్రాద్రిరామాలయంలో 21న శ్రావణ వరలక్ష్మి వ్రతం

**భద్రాచలం ఆగస్టు 18 (జనంసాక్షి)**

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణం జరిగే మిథిలా స్టేడియంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, నిర్వాహకులు తెలిపారు. శ్రావణ మాసం శ్రీ మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన మాసమని, ఈ మాసంలో వచ్చే శుక్రవారాలు అమ్మవారి ఆరాధనకు విశేషమైనవని నిర్వాహకులు తెలిపారు. వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం ద్వారా అమ ?మవారి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రతం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.



## అర్ధరాత్రి మారెళ్లపాడు పనులపై
# ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేయాలి.. ఆలస్యాన్ని ఉపేక్షించేది లేదు
- నెలాఖరులోగా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**అశ్వాపురం, ఆగస్టు 18 (జనంసాక్షి):**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి తుమ్మలచెరువుకు గోదావరి జలాలను తరలించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పనుల పురోగతిని పరిశీలించేందుకు మంగళవారం అర్ధరాత్రి సుమారు పన్నెండు గంటల సమయంలో ఆయన మారెళ్లపాడు పనులను

మిగతా 2లో

# ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్స్ బహూకరణ

రామన్నపేట, ఆగస్టు 18 (జనంసాక్షి): మండలంలోని వెల్లంకి ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం మాజీ ఎంపీటీసీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి మంగళవారం రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ ను బహుకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇడెం రాధ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులందరూ కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల గదులు శిథిలావస్థలో ఉన్న స్థానంలో కొత్త తరగతి గదులను ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయించాలని కోరారు. మాజీ ఎంపిటిసి తిమ్మాపురం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటామని, అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న గదుల స్థానంలో రెండు అదనపు గదులను ఎమ్మెల్యే సహకారంతో తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్ పర్సన్ పులగం సులోచన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి , ఉయ్యాల బిక్షమయ్య, మందుగుల వెంకటయ్య , ఇడెం స్వరూప సేవా ట్రస్ట్ చైర్మన్ ఇడెం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, నాయకులు గంజి నర్సింహ,భాస్కర్, చక్రపాణి, గోషిక కొండల్ రెడ్డి, కనుతాల భాస్కర్ రెడ్డి, ఎడ్ల సంజీవ రెడ్డి, రుద్ర వెంకటేష్,మిరియాల నరేశ్, మిరియాల వెంకటేష్,గోధుమల సోమప్ప తదితరులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి మారెళ్లపాడు పనులపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాత్రి, పగలు రెండు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తూ నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పనులు నిలిపివేయరాదని, పనుల్లో జాప్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.తుమ్మలచెరువుకు గోదావరి నీరు అందితే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైతే పనులు పూర్తయ్యే వరకు పగలు, రాత్రి ఇక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు. నెలాఖరులోగా మారెళ్లపాడు ప్రాజెక్టును ప్రారంభించి తీరుతామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. అర్ధరాత్రి సైతం పనులను స్వయంగా పరిశీలించడం ద్వారా ప్రాజెక్టు పనులపై ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యతను ఆయన చాటారు.ఈ తనిఖీలో అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకుడు పూసా అనిల్ కుమార్, సంబంధిత శాఖ అధికారులు శ్రీనివాస్, కోలా శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఆట పాట మాట

జూజిరెడ్డిగూడెం మండల ఎల్ నినో మూలంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు అన్నారు. తెలంగాణ సాంస్కృత సారధి ఆధ్వర్యంలో జూజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మంగళవారం పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, ఆరుతడి పంటల సాగు, డ్రగ్స్ పై కళాబృందం చే ఆటపాట మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బింగి కృష్ణమూర్తి, సారధి సభ్యులు ఈర్ల సైదులు, మేడిపల్లి వేణు, లక్ష్మి మాగి శంకర్, శిరీష, వేణు, అనురాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని మణి దంత వైద్యశాలను స్థాపించి 16 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు, రేపు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మణి దంత వైద్యశాల డాక్టర్ తోట కిరణ్ మంగళవారం తెలిపారు.మానవ శరీరంలో దంతాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ఆరోగ్యకరమైన దంతాలు సరైన జీర్ణక్రియకు, మెరుగైన సమగ్ర ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి తోడ్పడతాయని అన్నారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. దంత సమస్యలు ఉన్నవారు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలి

### రెండు రోజుల్లో ప్రారంభించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన : బొడ్డుపల్లి కృష్ణ

పి.ఏ.పల్లి,ఆగస్టు 18 (జనంసాక్షి): పి.ఏ.పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు.మంగళవారం పి.ఏ.పల్లిలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ మోడల్ స్కూల్ హాస్టల్‌ను ప్రారంభించకపోవడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.హాస్టల్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.హాస్టల్ ప్రారంభానికి అవసరమైన చర్యలను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.రెండు రోజుల్లోగా పి.ఏ.పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను పారంభించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బొడ్డుపల్లి కృష్ణ విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం, అధికారులు తీవ్రంగా పరిగణించి వెంటనే హాస్టల్‌ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష సమావేశం



చిట్యాల ,ఆగస్టు 18 (జనం సాక్షి): చిట్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రోడ్లు, తాగునీరు, ప్రజా సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో జెల్ల పాండు, ఎమ్మార్వో విజయ్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్, మండల సర్పంచులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి నిరూపిస్తే పదవికి రాజీనామా.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

- కూసుకుంట్లకు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు సవాల్..
- శనివారం చండూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణానికి ఆహ్వానం

చండూరు, ఆగస్టు 18 (జనంసాక్షి): చండూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు. ఆరోపణలను నిరూపిస్తే ముక్కు నేలకు రాసి చైర్మన్ పదవికి రాజీనామా చేయడమే కాకుండా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. అదే విధంగా ఆరోపణలు నిరూపించలేకపోతే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు.మంగళవారం చండూరు ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్, కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సోమవారం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన ప్రభుత్వ వ్యతిరేక ధర్నాలో చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వాస్తవాలను ప్రజలకు వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం సరికాదన్నారు.చండూరు ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బస్ షెల్టర్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ప్రారంభించారని చెప్పారు. అయితే దీనిపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు.మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు వైన్స్ వ్యాపారులు, పండ్లబండి వ్యాపారులు, ప్రైవేట్ ఆస్పత్రులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకున్నారంటూ.. చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. "మేము ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. శనివారం ఉదయం 9 గంటలకు చండూరు ఆంజనేయస్వామి దేవాలయానికి వచ్చి ప్రమాణం చేస్తాం. మేము డబ్బులు తీసుకున్నట్లు మీరు నిరూపించి ప్రమాణం చేయాలి" అని కూసుకుంట్లకు సవాల్ విసిరారు.తాను లేదా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో పాటు రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. మీ ఆరోపణలు నిరూపించలేకపోతే మీరు కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటారా?" అని మాజీ ఎమ్మెల్యేను ప్రశ్నించారు.కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే హోదాను మరిచి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అనుచితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న పండ్లబండి వ్యాపారులు, వైన్స్ వ్యాపారులు తాము మున్సిపల్ చైర్మన్‌కు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. చైర్మన్‌పై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు పేర్కొన్నారు. శనివారం ఆలయానికి వచ్చి ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బూతరాజు దశరథ, కౌన్సిలర్లు బుషిపాక వాసు, కోడి సుష్మ వెంకన్న, మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు, కో-ఆప్షన్ సభ్యులు ఖలీల్, మొగుదాల వెంకన్న, షరీఫ్, మున్సిపాలిటీ యూత్ ప్రెసిడెంట్ కన్నబోయిన నాగరాజు, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు ఏలే శ్రీను, జూలూరు వెంకటేశం, పన్నాల లింగయ్య, కారింగు రాములు, బొమ్మరబోయిన వెంకటేశం, పున్న సైదులు, సమీర్, బుషిపాక సురేష్, కారింగు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు ఏజెన్సీ బంద్‌కు పిలుపు



## ○ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం
## ○తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర

**అన్నపురెడ్డిపల్లి ఆగస్టు 18 ( జనం సాక్షి )** ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు బుధవారం ఏజెన్సీ బంద్ నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ అన్నపురెడ్డిపల్లి మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర తెలిపారు. మంగళవారం పెంట్లం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో జీవో నంబర్ 109 ప్రకారం ఆదివాసీ అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా కేవలం 6 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. 29 శాఖల్లో జీవో నంబర్ 3తో పాటు షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలకు సంబంధించిన అంశాలను కలిపి ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి ఐటీడీఏల ద్వారా ఏజెన్సీ డీఎస్సీ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, ఉద్యోగాల్లో న్యాయం కోసం నిర్వహిస్తున్న బంద్‌కు మండలంలోని ఆదివాసీ నిరుద్యోగులు, యువత, ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. మండలంలోని వ్యాపారులు, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి సహకరించాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు మడివి నాగేంద్రబాబు, తాటి చంద్రావు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రానికి ఖమ్మం ఎంపీ సానుకూలత
### - 10 కుంటల స్థలం కేటాయింపు..
### - మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుపైనా హామీ..

**భద్రాచలం ఆగస్టు 18 (జనంసాక్షి)**
పాల్వంచ మండలంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ .ఎల్ . కాంతారావు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను విస్తరించడంతోపాటు, ఖమ్మం జిల్లాలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పాల్వంచలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బృందం ఎంపీ రఘురామిరెడ్డికి వినతిపత్రం సమర్పించింది. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంతారావు పేర్కొన్నారు. పాల్వంచలో 10 కుంటల భూమిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలంలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రంతోపాటు మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ .ఎల్ . కాంతారావు, వై. సూర్యనారాయణ, బి. వెంకటరెడ్డి, వి. కామేశ్వరరావు, జి. రాజారెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

## పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్యాపేట (జనంసాక్షి):**
పద్మశాలి సేవా సమాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్మశాలి విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నోట్ పుస్తకాల పంపిణీ చేస్తున్నందున అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పద్మశాలి సేవా సమాజ ట్రస్ట్ అధ్యక్షులు పెండెం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పెండెం వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 23న ఆదివారం ఉదయం10 గంటలకు పద్మశాలి భవన్ లో 2025 -26 విద్యా సంవత్సరంలో 10 తరగతి, ఇంటర్ రెండవ సంవత్సరంలో మెరిట్ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు 1500 రూపాయల చొప్పున ప్రతిభా పురస్కారము, 6వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న వారికి నోటు పుస్తకాలు, పెన్నులు, క్లాత్ బ్యాగులు పద్మశాలి ప్రముఖుల చేత అందజేయబడునని తెలిపారు.ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను పద్మశాలి భవన్ లో లేదా సెల్ నెంబర్ 7893661102లో సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు.

# టేకులపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కనకయ్య
## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**టేకులపల్లి, ఆగస్టు 18(జనంసాక్షి):**
టేకులపల్లి మండలంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొక్కం పాడు గ్రామపంచాయతీలో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన, రామచంద్రునిపేట గ్రామపం చాయతీ పరిధిలోని పాతర్లగడ్డ గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన పైప్ కల్వర్ట్‌ను ప్రారంభించారు. రామచంద్రునిపేట గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టనున్న పైప్ కల్వర్ట్, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చింతోని చెలక గ్రామంలో సైడ్ డ్రైనేజ్, రోడ్డు పనులకు శంకుస్థాపన, శంభుని గూడెంలో అంగన్వాడి భవనం ప్రారంభించి, అదే గ్రామంలో సైడ్ డ్రైనేజ్ కోసం శంకుస్థాపన చేశారు. లచ్చగూడెం లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, కల్వర్టు, సైడ్ కాలువ పనులకు శంకుస్థాపన చేశారు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కావ్య అనే బాలికను వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలలో విస్తృతంగా పర్యటించి ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన సభలలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.



అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేం దుకు కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల పర్యటన కంటే ముందు టేకులపల్లి లోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను, బద్దుతండాలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాదరావు, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, బుర్ర ధర్మయ్య గౌడ్, మొక్కంపాడు సర్పంచ్ సురేష్, రామచంద్రునిపేట సర్పంచ్ వాసం సువర్ణ, ఉప సర్పంచ్ వాసం రాఘవేందర్ రావు, చింతొని చిలక సర్పంచ్ మెట్ల తులసమ్మ, శ్యాములగూడెం సర్పంచ్ బట్టు శివ, లచ్చగూడెం సర్పంచ్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష రిలే నిరహారదీక్షకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు



**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష 5వ రోజుకు చేరుకుంది.కేంద్ర ప్రభుత్వం మొదట ఇచ్చిన హామీ ప్రకారం బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను మార్చుడాన్ని వ్యతిరేకిస్తూ సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ చౌరస్తా వద్ద గత ఐదు రోజులుగా ఈ దీక్షలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన రిలే నిరాహారదీక్షలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.సూర్యాపేట మీదుగా ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ రూట్ ను మార్చవద్దని కోరారు. బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్పు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

## నూతన మీ సేవ కేంద్రాల నిర్వహణకు దరఖాస్తు ఆహ్వానం

**చిట్యాల , ఆగస్టు 18 (జనంసాక్షి):**
నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామం, శాలిగౌరారం మండలంలోని తక్కెళ్ళ పహాడ్ గ్రామంలో నూతన మీ సేవ కేంద్రాల నిర్వహణకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయం లోని మీసేవ విభాగంలో దరఖాస్తు ఫారం తీసుకొని కంప్యూటర్ పరిజ్ఞానం కి సంబంధించిన సర్టిఫికెట్లు,విద్యార్హత (గ్రాడ్యుయేట్), జనన ధ్రువీకరణ లేదా ఎస్ ఎస్ సి మెమో,ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్,రెండు పాస్ ఫోటోలు,పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ల జిరాక్స్ లను జత చేసి ఈ నెల 27 వరకు సమర్పించాలని అర్హులకు రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.



## కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయవద్దు

**సూర్యాపేట(జనంసాక్షి):**




పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయకుండా నిరంతరం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచనలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత అండగా నిలిచాయని అన్నారు.ఈ పథకాలను రద్దు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూమి ఇచ్చిన దాత కుటుంబానికి ఆయా పోస్టు ఇవ్వాలి
### భూమి ఇచ్చిన దాత బొమ్మల కనకరాజు

**ఆళ్ళపల్లి ఆగస్టు18( జనం సాక్షి)**
మండల కేంద్రంలోని నడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సంది బంధం గ్రామానికి చెందిన బొమ్మల లక్ష్మి అంగన్వాడి ఆయాగా పనిచేస్తూ రిటైర్మెంట్ తీసుకుంది బొమ్మల కనకరాజు కుటుంబం అంగన్వాడి స్కూల్ కి 2008లో పట్టా ఉన్న భూమిని ఇచ్చారని గ్రామంలోని ప్రజలు తెలిపారు ఇప్పుడు ప్రభుత్వం అంగన్వాడి ఆయా పోస్ట్ ని సంధ్యమ్మను ప్రకటించడంతో మళ్లీ మాకే ఇవ్వాలని బొమ్మల కనకరాజు కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు సందిబంధం గ్రామస్తులు కూడా ఆయా పోస్టునువారికే ఇవ్వాలని కోరుకుంటున్నారు తెలంగాణ ప్రభుత్వం సహకరించి తమకే ఇవ్వాలని కనకరాజు కుటుంబ సభ్యులు మొరపెట్టుకుంటున్నారు అంగన్వాడి కేంద్రానికి ఎవరు ఆయా పోస్ట్ పై అప్లై చేసిన అంగన్వాడి కేంద్రాల్లో పని చేసేది మాత్రం బొమ్మల కనకరాజు కుటుంబ సభ్యులేనని గ్రామస్తులు తెలిపారు.





# పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలి

### పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్




**టేకులపల్లి, ఆగష్టు 18(జనంసాక్షి):** పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనుకకు తీసుకోవాలని పీడీఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పిడిఎస్ యు ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షురాలు రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్య విధానంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం శక్తి ( స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ ) లో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేసే కుట్ర చేస్తుంద ని, ఈ విధానాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.పాలిటెక్నిక్ చదువుకునే విద్యార్థులను శక్తిలో కలపడం అంటే వారి ఉన్నత విద్య అవకాశాలను పూర్తిగా తొలగించ డమేనని, పాలిటెక్నిక్ విద్యకు ఇది ఒక రకమైన సమాధి లాంటిదని, తక్షణమే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించి పాలిటెక్నిక్ విద్యను యధా విధంగా ఉన్నత విద్యా మండలిలోనే కొనసాగించాలని, లేని పక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు రాజేశ్వరి,ఉష,దీపిక, లోకేష్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్ఎల్ఎన్ తో శ్వాస పీల్చాలి.. ఎఫ్ఎల్ఎన్‌తో శ్వాస వదలాలి

### - ఎంఈవో బెక్కంటి శ్రీనివాసరావు

**భద్రాచలం ఆగష్టు 18 (జనంసాక్షి)** ప్రాథమిక స్థాయిలో విద్యార్థి కేంద్రిత బోధనకు ఉపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం భద్రాచలం మండల రిసోర్స్ కేంద్రంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో గుణాత్మక విద్యను సాధించేందుకు తరగతి గదిలో అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థి కేంద్రంగా ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రధానోపాధ్యాయులకు సుమారు రెండు గంటలపాటు శిక్షణ ఇచ్చారు. బుధ, గురువారాల్లో మండలంలోని కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించనున్న సమావేశాల్లో తీసుకోవాల్సిన అంశాలు, పాటించాల్సిన విధానాలు, బోధించాల్సిన అంశాలపై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లకు పలు సూచనలు చేశారు. అలాగే ఈ ఏడాది మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక విద్యార్థుల నమోదును సాధించిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గవర్నమెంట్ హైస్కూల్ కు చెందిన జాన్సన్ , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి. రమా, మండల ప్రాథమికోన్నత పాఠశాల, జగదీష్ కాలనీకి చెందిన రాజా శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల, తాతగుడి సెంటర్ కు చెందిన పాపయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ పీలు గోపి, ఆర్ కే, సీసీ బేబీ, ఐఈఆర్ పీ ఎస్. పద్మ, ఏపీఎం పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం

**భద్రాచలం ఆగష్టు 18 (జనంసాక్షి)** భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని శ్రీరామ సేవా మండపంలో నిర్వహించిన ఈ కల్యాణ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణంలో అత్యంత కీలకమైన జీలకర్ర-బెల్లం, మాంగల్యధారణ కార్యక్రమాలు భక్తుల హర్షధ్వానాల మధ్య జరిగాయి. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



# పాడైన బోరింగ్‌కు మరమ్మతులు చేయించిన సర్పంచ్ మందా నాగరాజు



**బూర్గంపహాడ్ ఆగష్టు 18 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ఏజీహెచ్ఎస్ ఆశ్రమ బాలికల పాఠశాలలో పాడైపోయిన బోరింగ్‌కు సర్పంచ్ మందా నాగరాజు మరమ్మతులు చేయించారు. పాఠశాల వార్డెన్ టి. పద్మావతి, హెచ్ఎం ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందిం చిన సర్పంచ్ విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. మంగళవారం పాఠశాలకు స్వయంగా వెళ్లిన సర్పంచ్ మందా నాగరాజు, బోరింగ్ మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షిం చారు. విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందిం చిన సర్పంచ్‌కు పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ఎస్ పి కి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన పోతిరెడ్డి

**బూర్గంపహాడ్ ఆగష్టు 18 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి తన కుమారుడి వివాహ వేడుకకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ కుమార్‌ను ఆత్మీయంగా ఆహ్వానించారు.

మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో రోహిత్ రాజ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని ఎస్పీని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ కుమార్‌తో పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



### పోలీస్ ఉచిత శిక్షణ శిబిరాలను

# సద్వినియోగం చేసుకోవాలి

### ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువతకు పిలుపు



**చంద్రుగొండ ఆగష్టు 18( జనంసాక్షి) :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్.కె. వసీంపాషా కోరారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.శిక్షణలో రాష్ట్రస్థాయిలో పేరొందిన అధ్యాపకులతో బోధన, ప్రామాణిక పుస్తకాల ఉచిత పంపిణీ, ప్రతిరోజూ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు, వారానికి ఒకసారి ప్రత్యేక పరీక్షలు, శారీరక దారుఢ్య సాధన వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించేలా నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.పేర్ల నమోదుకు చివరి తేదీ: 27 ఆగష్టు 2026శిక్షణ ప్రారంభం: 1 సెప్టెంబర్ 2026,మరిన్ని వివరాల కోసం ఖమ్మం: 8985095599, కొత్తగూడెం: 8985096699 నంబర్లను సంప్రదించాలని సూచించారు.నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగ సాధన దిశగా ముందడుగు వేయాలని ఎస్.కె. వసీంపాషా కోరారు.

# భద్రాచలం గ్రామపంచాయతీ తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు..

### - హైదరాబాద్ కు మెరుగైన వైద్యం కోసం తరలించిన అధికారులు

భద్రాచలం ఆగష్టు 18 (జనంసాక్షి)



భద్రాచలం గ్రామపంచాయతీకి చెందిన తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కనుకు చిట్టిబాబు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ట్రాక్టర్ అదుపుతప్పడంతో డ్రైవర్ చిట్టిబాబుకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో డ్రైవర్ కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించారు. తొలుత అధికారుల స్పందనపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ చిట్టిబాబును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి అధికారులు తరలించారు. డ్రైవర్ కు మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, డ్రైవర్ విధుల్లో ఉన్న సమయంలో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయనే అంశాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# క్రికెట్ అకాడమీకి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక

భద్రాచలం ఆగష్టు 18 (జనంసాక్షి)

భద్రాది కొత్తగూడెం జిల్లా :- హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన సీ డివిజన్ వన్డే లీగ్ కు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. భద్రాచలంలో సీబీఎస్ ఏ క్రికెట్ అకాడమీకి చెందిన వీరు తమ ప్రతిభతో జిల్లా స్థాయిలో గుర్తింపు పొందారు. అకాడమీ చైర్మన్ సాయి కిషోర్, హెడ్ కోచ్ శ్రావణ్, జూనియర్ చందు, డిప్ పాషా తమ ప్రతిభను చాటుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. కోచ్ చరణ్ తేజ్ ఆధ్వర్యంలో క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందిన వీరు క్రికెట్ లో రాణిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడాకారుల ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు కోచ్ శరత్ తేజ్, వారితోపాటు క్రికెట్ అభిమానులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

# గుప్తనిధుల వేటకు మర్రిగూడే అడ్డా?

○శివన్నగూడ రిజర్వాయర్ చుట్టూ అర్ధరాత్రి అనుమానాస్పద సంచారం
○పురాతన దేవాలయాలే లక్ష్యమా? కర్ణాటక ముఠాల ప్రమేయంపై అనుమానాలు
○ఇటీవల పోలీసులకు పట్టుబడిన బ్యాచ్‌తో సంబంధాలపై ఆరా తీయాల్సిన అవసరం




**మర్రిగూడ, ఆగస్టు 18 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో గుప్తనిధుల వేటపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా శివన్నగూడ రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల సంచారం జరుగుతోందన్న సమాచారం స్థానికంగా కలకలం రేపుతోంది. పురాతన దేవాలయాలు, గుట్టలు, నిర్మానుష్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని గుప్తనిధుల కోసం తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఆందోళనకు గురిచేస్తోంది.

**ఇటీవలే ఓ బ్యాచ్ పోలీసులకు పట్టుబాటు**
గుప్తనిధుల కోసం అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ బ్యాచ్ ఇటీవల పోలీసులకు పట్టుబడటం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అయితే వారు ఎక్కడి నుంచి వచ్చారు? వారి లక్ష్యం ఏమిటి? ఎవరైనా స్థానికులు వారికి సహకరిస్తున్నారా? అన్న వివరాలు పోలీసుల దర్యాప్తులో పూర్తిగా వెలుగులోకి రావాల్సి ఉంది. తాజాగా కనిపిస్తున్న అనుమానాస్పద కదలికలకు, గతంలో పోలీసులకు పట్టుబడిన బ్యాచ్‌కు ఏమైనా సంబంధం ఉందా? లేక మరో కొత్త ముఠా రంగంలోకి దిగిందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**కర్ణాటక ముఠాలపై అనుమానాలు**
మర్రిగూడ మండలానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరిని తీసుకువచ్చి గుప్తనిధుల కోసం తవ్వకాలకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం కూడా స్థానికంగా వినిపిస్తోంది. అయితే ఈ అంశాన్ని పోలీసులు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. కేవలం ప్రచారాల ఆధారంగా ఎవరినీ నిందితులుగా పేర్కొనలేని పరిస్థితిలో, అనుమానాస్పద కదలికలపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

**పురాతన దేవాలయాల పరిరక్షణపై ఆందోళన**
గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడితే పురాతన దేవాలయాలు, చారిత్రక ఆనవాళ్లు, గుట్ట ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని కోరుతున్నారు.

**అసలు సూత్రధారులు ఎవరు?**
గుప్తనిధుల వేట వెనుక అసలు సూత్రధారులు ఎవరు? ఇటీవల పోలీసులకు పట్టుబడిన బ్యాచ్‌కు ప్రస్తుత అనుమానాస్పద కదలికలతో సంబంధం ఉందా? ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొస్తున్నది ఎవరు? వారికి స్థానికంగా సహకరిస్తున్నది ఎవరు? పురాతన దేవాలయాలు, గుట్ట ప్రాంతాలపై సమాచారం వారికి ఎలా అందుతోంది? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి.
శివన్నగూడ రిజర్వాయర్ పరిసరాలు, పురాతన దేవాలయాలు, గుట్ట ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద కదలికలపై విచారణ చేపట్టాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. ఇటీవల పట్టుబడిన బ్యాచ్‌తో పాటు వారి పరిచయాలు, కదలికలు, స్థానిక సంబంధాలపై పోలీసులు దృష్టి సారిస్తే గుప్తనిధుల వేట వెనుక ఉన్న అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## బీఆర్ఎస్ లో చేరినందుకే రామారావుపై కక్ష కట్టారు

○పథకం ప్రకారమే దాడి చేసేందుకు ప్రణాళిక
○మూడు రోజుల ముందే ప్రాణహాని ఉందని వెల్లడించారు
○వేలేఖరుల సమావేశంలో బీఆర్ఎస్ నేత అల్లిక వెంకటేశ్వరరావు

**ఖమ్మం రూరల్, ఆగస్టు 18 (జనం సాక్షి)**
బీఆర్ఎస్ పార్టీలో చేరినందుకే మారుతి రామారావుని హత్య చేసేందుకు కక్ష కట్టారని పక్కా ప్రణాళికతోనే దాడికి యత్నించారని బీఆర్ఎస్ నేత, హర్షిణి డెవలపర్స్ అధినేత అల్లిక వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం గూడూరుపాడు గ్రామంలో బాధితులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతి రామారావు ఇటీవల సీపీఐకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడంతో కొందరు కక్ష పెంచుకున్నారని వెంకటేశ్వరరావు ఆరోపించారు. సీపీఐ నాయకుడు పుచ్చకాయల కమలాకర్ నుంచి రామారావుకు సుమారు రూ.6 లక్షలు రావాల్సి ఉందని, డబ్బులు చెల్లించాలని పలుమార్లు కోరడంతో వివాదం తలెత్తిందన్నారు. ఈ నేపథ్యంలో రామారావును బెదిరింపులకు గురిచేశారని తెలిపారు.తనకు ప్రాణహాని ఉందని భావించిన రామారావు ఈ నెల 14న ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరారని చెప్పారు. అనంతరం మధ్యవర్తుల ద్వారా డబ్బుల వ్యవహారాన్ని పరిష్కరించుకుందామని సమాచారం వచ్చినప్పటికీ, మరుసటి రోజు జెండా వందనం కార్యక్రమం ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయారని తెలిపారు. ఈ నెల 16న రాత్రి ఖమ్మం నుంచి గూడూరుపాడు బయలుదేరిన రామారావు, బట్టు రామారావుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ పొలిమేర వద్ద మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రాడ్లతో దాడికి యత్నించారని ఆరోపించారు. దాడి నుంచి మారుతి రామారావు తప్పించుకోగా, బట్టు రామారావుకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై సోమవారం ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.గ్రామంలో దశాబ్ద కాలంగా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణం ఉందని, మళ్లీ గ్రామాన్ని అశాంతికి గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంకటేశ్వరరావు ఆరోపించారు. రామారావును లక్ష్యంగా చేసుకుని తొమ్మిది మంది కలిసి కుట్ర పన్నినట్లు తమకు సమాచారం ఉందన్నారు.దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. గ్రామంలో బీఆర్ఎస్ ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులను ఉసిగొలిపి దాడులకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రామారావు ప్రాణాలకు ముప్పు ఉన్నందున ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు బండి అమ్మరాజు, పడిగల వెంకటేశ్వర్లు, కుర్రి లింగయ్య,కుర్రి తిరుపతిరావు, పడిగల రాము తదితరులు పాల్గొన్నారు.

## పాత నేరస్తులు మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

○మళ్లీ నేరం చేస్తే పీడీ చట్టం.. పాత నేరస్తులపై పోలీసుల నిఘా..
○రౌడీషీటర్లకు మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ రవి హెచ్చరిక..

**హాలియా, ఆగస్టు 18 జనంసాక్షి:**
పాత నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ జి. రవి హెచ్చరించారు. మంగళవారం హాలియా వలయ పోలీసు కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా డీఎస్పీ రౌడీషీటర్లతో మాట్లాడి వారి గత నేర చరిత్ర, ప్రస్తుతం చేస్తున్న పనులు, కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.గొడవలకు దిగడం, ఇతరులను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం, అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. గతంలో నేరాలకు పాల్పడినప్పటికీ ప్రస్తుతం చట్టబద్ధమైన జీవనం సాగిస్తూ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎవరైనా మళ్లీ నేర కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని డీఎస్పీ స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులతో కలిసి తిరగడం, వివాదాల్లో జోక్యం చేసుకోవడం, యువతను నేరాల వైపు ప్రోత్సహించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి గొడవలు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున సంయమనంతో వ్యవహరించాలని తెలిపారు. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేరాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తుల గురించి లేదా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు. నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.ఇప్పటికే నేరాలకు దూరంగా ఉంటున్న వారు అదే విధానాన్ని కొనసాగించాలని, తిరిగి నేర కార్యకలాపాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. చట్టాన్ని గౌరవిస్తూ జీవించడం ద్వారా కుటుంబంతో పాటు సమాజంలోనూ గౌరవప్రదమైన స్థానం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాలియా, సాగర్ సీఐలు ఎస్. రాఘవరావు, శ్రీను నాయక్, ఎస్ఐలు బండి సాయి ప్రశాంత్, నరేష్, విజయ్‌కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





# కాల్వ సమస్యను పరిష్కరించాలి



- ఇండ్ల మధ్య నుంచి మురికి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- సిపిఎం మండల కార్యదర్శి, సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం
- ఇరిగేషన్ అధికారులు చొరవ చూపాలి

**రామన్నపేట, ఆగస్టు 18 (జనంసాక్షి):** రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలోని దళిత కాలనీలో ఇండ్ల మధ్య నుంచి రాచకాల్వ నీరు ప్రవహిస్తున్న కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాలనీని పరిశీలించారు.కాల్వలో మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో పాటు, విషసర్పాలు, ఇతర విషపురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మురికి నీటి కారణంగా కాలనీ ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని వారు తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ కాలనీ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ అధికారులు రాచకాల్వ సమస్యకు శాశ్వ త పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. కాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని, మురికి నీరు సక్రమంగా ప్రవహించేలా స్లాబ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.కాల్వ సమస్యను వెంటనే పరిష్కరించి దుర్గంధం, దోమలు, విషసర్పాల బెడద నుంచి కాలనీ ప్రజలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే ఇటువంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటి సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్,వార్డు సభ్యులు గంటెపాక శ్రీను, బూడిద నర్సింహా,నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్, బూడిద బిక్షం, ఉండ్రాతి నర్సింహా, ఎండీ మైనొద్దీన్,జోగుల శ్రీనివాస్, గునుగుంట్ల సత్యనారాయణ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## నాణ్యతండాలో ఘనంగా తీజ్ వేడుకలు

**జాజిరెడ్డిగూడెం( జనంసాక్షి):** మండలంలోని నాణ్య తండాలో ఘనంగా తీజ్ వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. గిరిజన మహిళలు మొలకల బుట్టలను నెత్తిపై పెట్టుకుని సాంప్రదాయ పద్దతిలో వేడుకలను నిర్వహించారు. తర్వాత గ్రామ సమీపంలో ఉన్న చిన్న కుంటలో మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్ గౌడ్, సర్పంచ్ కేలోతు కాంతమ్మ హరిలాల్ నాయక్, వల్లపు గంగయ్య, మాజీ సర్పంచ్ మాణిక్యం, ఉప సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు

## కోదాడలో సీఎంఆర్ అవకతవకలు..

### రైస్ మిల్లు యజమాని అరెస్ట్..



**కోదాడ,( జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని విజయలక్ష్మి రైస్ కార్పొరేషన్ మిల్లులో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అవకతవకలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ దశరథ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యానికి సంబంధించి లెక్కలను పరిశీలించారు. 2024, 2025, 2026 సీజన్లకు సంబంధించి మొత్తం 4,736.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి సుమారు రూ.13.51 కోట్ల మేర బకాయి ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మిల్లు యజమాని మేళ్లచెరువు శంకర్రావును పోలీసులు అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. సీఎంఆర్ బియ్యాన్ని నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి అప్పగించని మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## షాదీముబారక్, కల్యాణ లక్ష్మి సంక్షేమ పథకాలను కొనసాగించాలి..

**భద్రాచలం ఆగస్టు 18 (జనంసాక్షి)** అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలను నిరంతరం అమలు చేయాలని మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాచలంలోని అశోక్ నగర్ కాలనీలో మాల మహానాడు పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలిచాయని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాల అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకపోతే ప్రజా ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో చినిగిరి చిట్టిబాబు, దేవరాజ్, రాజకుమార్, శ్రీను, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్య చిత్రానికి ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ కి ప్రత్యేక బహుమతి



**నల్గొండ,ఆగస్టు 18,(జనం సాక్షి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో 'ది హాన్స్ ఇండియా' ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్ ప్రతిభ చాటారు. ఆయన 'ప్రాథమిక విద్య' అంశంపై తీసిన ఫోటో ప్రత్యేక బహుమతికి ఎంపికైంది.ఈ అవార్డును ఈ నెల 23న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అందజేయనున్నారు. అదేవిధంగా కర్ణాటకకు చెందిన ఓ మీడియా సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో శ్రీనివాస్ గౌడ్ తీసిన మరో వార్తా చిత్రం 'ఉత్తమ వార్తా చిత్రం'గా ఎంపికైంది.ఫోటో జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న శ్రీనివాస్ గౌడ్‌కు గతంలోనూ పలు రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు లభించాయి. వరుసగా ప్రతిష్టాత్మక అవార్డులు సాధిస్తున్న ఆయనను జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

# విద్యుత్ ప్రైవేటీకరణతో ముప్పు.. ప్రజలు, నిరుద్యోగులపై తీవ్ర భారం!

- కాంట్రాక్ట్ టెండర్ల పేరిట నష్టాల్లోకి విభాగాలు..
- 47 రోజులుగా ఉద్యోగుల నిరసన..
- నేడు విద్యుత్ సౌధ ముట్టడి..

**భద్రాచలం ఆగస్టు 18 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా జరుగుతున్న పరిణామాలు భవిష్యత్తులో తీవ్ర ప్రతికూల ఫలితాలకు దారి తీసేలా ఉన్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్త మవుతోంది. ప్రభుత్వ పరిధిలోని విద్యుత్ సంస్థ లను ప్రైవేట్ వ్యక్తులకు, కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ప్రజలతో పాటు నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లాలోని పాల్వంచ, భద్రాచలం, మణుగూరు మూడు డివిజన్ల పరిధిలో విద్యుత్ ఉద్యోగులు గత 47 రోజులుగా ఆందోళన బాట పట్టినప్పటికీ ప్రజా ప్రభుత్వం స్పందించక పోవడాన్ని నిరసిస్తూ.. నేడు హైదరాబాదులోని 'విద్యుత్ సౌధ' ముట్టడికి ఉద్యోగులు రణభేరి మోగించారు.

**- అధిక టెండర్లతో ఆర్థిక నష్టం..**

ప్రస్తుతం విద్యుత్ శాఖలోని సొంత సిబ్బందితో చేస్తున్న పనులను కూడా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇ చ్చేందుకు అధిక విలువతో టెండర్లు కేటాయిస్తు న్నారు. శాఖ ద్వారా అయ్యే వ్యయం కంటే ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న టెండర్ల విలువ చాలా ఎక్కువగా ఉండటంతో డిపార్ట్ మెంట్ కు తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఉద్యోగావకాశాలకు భారీ గండి ప్రైవేటీకరణ వల్ల అత్యంత తీవ్రంగా దెబ్బతినేది తెలంగాణ నిరుద్యోగ యువతే. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత, ఆ ఖాళీలలో కొత్త నియామకాలు చేపట్టే అవకాశం లేకుండాపోతుంది. ఒకవేళ సంస్థలు ప్రైవేట్ పరమైతే తెలంగాణ యువత తమ ఉద్యోగావకాశాలను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

**- సామాన్యులపై ఛార్జీల భారం.. పథకాలకు ముప్పు!**

విద్యుత్ అనేది సామాన్య మానవుడి రోజువారీ జీవితంలో అత్యంత కీలకమైన అత్యవసర సేవ. కాంట్రాక్ట్ సంస్థలు తమ వ్యయాన్ని, లాభాలను రాబట్టుకోవడానికి నిరంతరం కరెంట్ చార్జీలను పెంచే అవకాశం ఉంది. విద్యుత్ చార్జీల రూపం లో సామాన్య ప్రజలపై అధిక భారం పడుతుంది. అంతేకాకుండా, ప్రభుత్వం ప్రస్తుతం పేదలకు, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు కూడా ప్రైవేటీకరణ వల్ల భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**- విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాను జయప్రదం చేయాలి**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు హైదరాబాద్ లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్, డీఈ కె. జీవన్ కుమార్ పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్ ను మంగళవారం భద్రాచలం డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కె. జీవన్ కుమార్ మాట్లాడుతూ పీఆర్సీ విద్యుత్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని అన్నారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణతోపాటు ఈపీఎఫ్ ను జీపీఎఫ్ గా మార్చాలని, సాధారణ బదిలీలను పార దర్శకంగా నిర్వహించాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ ఈబీ నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**- ప్రయివేటీకరణ వలన ప్రజలపై పెనుభారం**

విద్యుత్తు సంస్థల ప్రయివేటీకరణ వలన భవిష్యత్తులో వినియోగదారులపై ఆర్థికభారం తీవ్రంగా పడనుంది. అలాగే ఇప్పుడు విద్యుత్తు సంస్థలో ఇచ్చే కాంట్రాక్టులను అధిక రేట్లకు ఇవ్వడం వలన వినియోగదారులపై ఆర్థికభారం పడుతుంది. దీంతో విద్యుత్తు చార్జీలను పెంచడంతో పాటు విద్యుత్తు సంస్థలు మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

**- కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం వలన చార్జీల మోత.**

ప్రయివేటీకరణ చేస్తే విద్యుత్తు సంస్థల మనుగడ కోల్పోనున్నాయి. కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం వలన చార్జీల మోత, ప్రజలకు నష్టం కలిగించే సంస్కరణ లు తెస్తే ఆ భారం ప్రజలతో పాటు విద్యుత్తు సంస్థల మనుగడపై సైతం పడుతుంది. దీంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసిన అవసరం ఏర్పడుతుంది. ప్రభుత్వమే నడిపితే విద్యుత్తు సంస్థల మనుగడ బాగుటుంది. ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

## విద్యుత్ మోటార్ కేబుళ్ల దొంగల ముఠా అరెస్ట్

**చిలుకూరు, ఆగస్టు 18(జనంసాక్షి):** వ్యవసాయ బావులు వద్ద విద్యుత్ మోటార్ల కేబుల్స్ ను దొంగతనం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చిలుకూరు గ్రామానికి చెందిన నాగిరెడ్డి రామిరెడ్డి వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటార్ కేబుల్ ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు దుండగులు సురేష్, చింతల గోపమ్మ, సంపంగి గోపిలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారణ చేయగా 20 మోటార్ల కేబుల్స్ ను దొంగలించారని ఒప్పుకోవడంతో రైతు నాగిరెడ్డి రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసి, రిమాండ్ కు తరలించినట్టు ఎస్సై బండి మోహన్ బాబు తెలిపారు.



# ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం అవకాశం

## వర్షాధార పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

**తుర్కపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి)**
ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మెట్ట (వర్షాధార) పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఉమారాణి సూచించారు. మంగళవారం తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక నీటిఅవసరమున్న పంటలకు బదులుగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించు కోవచ్చని తెలిపారు.



వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్వల్పకాలిక పంటలైన ఉలువలు, పెసర్లు, మినుములు, నువ్వులు, జొన్నలు, కూరగాయలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దత్తాయిపల్లి సర్పంచ్ జెర్రిపోతుల కరుణాకర్, ఉపసర్పంచ్ జిట్టా బాలకృష్ణ, గ్రామ కారోబార్ ఎరుకల స్వామిగౌడ్, రైతులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటలో బెట్ట పరిస్థితులు - రైతులు అప్రమత్తంగా ఉండాలి

## పంటను కాపాడుకునేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

## మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న

**హాలియా, ఆగస్టు 18 జనంసాక్షి:**
అనుముల మండలంలో 2026?27 వానాకాలం సీజన్‌లో సుమారు 12,000 ఎకరాలకు పైగా పత్తి పంట సాగు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ తెలిపింది. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో పత్తి పంట నీటి ఎద్దడికి గురవుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న తెలిపారు. ప్రస్తుతం ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో పత్తి మొక్కల ఆకులు వడలిపోవడం, మొక్కలు వంగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి బెట్ట పరిస్థితుల్లో పత్తి మొక్కలు నీటి ఎద్దడిని కొంతవరకు తట్టుకునేలా, వర్షాలు వచ్చే వరకు పంటను కాపాడుకునేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.



రైతులు చేపట్టాల్సిన చర్యలు..
బెట్ట పరిస్థితుల్లో పత్తి పంటకు కింది వాటిలో ఏదైనా ఒకదానిని మాత్రమే ఎంపిక చేసుకుని పిచికారి చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది.

1. 13-0-45 పౌడర్: ఎకరానికి 1 కిలో లేదా లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.
లేదా
2. 19-19-19 పౌడర్: ఎకరానికి 1 కిలో లేదా లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.
లేదా
3. 28-28-0: లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.
లేదా
4. నానో యూరియా ద్రావణం: లీటర్ నీటికి 4 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి. వీటిలో ఏదైనా ఒకదానిని మాత్రమే ఎంపిక చేసుకుని పిచికారి చేయడం ద్వారా పత్తి పంట బెట్ట పరిస్థితులను కొంతవరకు తట్టుకొని, వర్షాలు వచ్చే వరకు పంటను నిలబెట్టుకునేందుకు సహాయపడుతుందని మండల వ్యవసాయ అధికారి ఎం. వెంకన్న తెలిపారు. రైతులు తమ సమీప ఏఈఓలను సంప్రదించి, తమ పంట పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ హత్యపై మహిళా కమిషన్ సుమోటో

**జనం సాక్షి ప్రతినిధి,ఆగస్టు 18,(జనంసాక్షి):**
నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం జేబీ కాలనీలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ కుల్లు రూపా రెడ్డి దారుణ హత్య ఘటనపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా విచారణకు ఆదేశించింది. తన నివాసంలో రూపా రెడ్డి



హత్యకు గురైన ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నప్పటికీ నిందితులను గుర్తించకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. మీడియాలో వచ్చిన కథనాలు, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదికను సమర్పించాలని నల్గొండ జిల్లా ఎస్పీని ఆదేశించింది. మహిళలపై జరిగే ఇలాంటి తీవ్రమైన హింసాత్మక ఘటనలను అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

- ○ యూత్ డిక్లరేషన్ పై నిరుద్యోగ సదస్సు
- ○ రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే, ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు అందిస్తాం
- ○ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు

**హుజూర్‌నగర్, ఆగస్టు 18 (జనంసాక్షి):**
యువతకు ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని హుజూర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో మంగళవారం "యూత్ డిక్లరేషన్" పై నిరుద్యోగ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి హాజరయ్యారు.



ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణలో విద్య, ఉపాధి రెండింటినీ ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. "గుంపుల మేస్త్రి రేవంత్ వల్ల యువత భవిష్యత్ ఆగమవుతుంది" అని అన్నారు. పక్క రాష్ట్రాల్లో విద్యకు అధిక నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణలో ఆ పరిస్థితి లేదని చెప్పారు. రేవంత్ కుటుంబ పాలన నడుస్తుందని, భూముల కబ్జాల్లో రేవంత్ కుటుంబం మునిగిపోయిందని ఆరోపించారు. విద్యార్థులకు 2 ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల కాలేజీలు మూతపడే పరిస్థితి వచ్చిందని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. "ఇంజినీర్లను క్రిమినల్స్ అంటున్నారు. ఒక క్రిమినల్ మైండ్ ఉన్న వ్యక్తి రేవంత్ అని ఆరోపించారు. ఆయనే మొదటి క్రిమినల్" అని ధ్వజమెత్తారు. కెసిఆర్ కష్టపడి తెలంగాణను అభివృద్ధి చేస్తే, ప్రస్తుతం రేవంత్ రాష్ట్రాన్ని ఆగం చేశారని విమర్శించారు. సాఫ్ట్‌వేర్ రంగం దెబ్బతిని, ఉద్యోగాలు పోయి యువత రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ అని ప్రగల్భాలు పలికి ఇప్పుడు మొఖం చాటేశారు. యువత ఆత్మస్థైర్యం దెబ్బతినేలా రేవంత్ మాట్లాడుతున్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో పార్టీని కాపాడిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మండల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 30లోపు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

○14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవితబాబురావు

**హుజూర్‌నగర్, ఆగస్టు 18 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన పింఛన్ల ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని పట్టణ 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆగస్టు 30 చివరి తేదీ అని తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ వార్డులో అర్హులైన లబ్ధిదారుల కోసం పింఛన్ దరఖాస్తు ఫారాలు తన వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. వృద్ధాప్య పింఛన్లు మినహా, చేనేత కార్మికులు, వితంతువులు, కల్లు గీత కార్మికులు, ఒంటరి మహిళలు, డయాలసిస్, క్యాన్సర్ బాధితులు తదితర అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులను తానే స్వయంగా పూర్తి చేసి మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయిస్తానని కౌన్సిలర్ హామీ ఇచ్చారు.
దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు:
-పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో
-ఆధార్ కార్డు జిరాక్స్
-రేషన్ కార్డు జిరాక్స్
-బ్యాంక్ అకౌంట్ జిరాక్స్
-డెత్ సర్టిఫికెట్ జిరాక్స్ వితంతు పింఛన్‌కు



-ఆదాయ ధృవీకరణ పత్రం జిరాక్స్
-ఓటర్ గుర్తింపు కార్డు
-వికలాంగులకు వికలాంగుల సర్టిఫికెట్
-గౌడ కార్మికులకు గౌడ సంఘం సభ్యత్వ కార్డు
14వ వార్డు ప్రజలతో పాటు పట్టణంలోని అర్హులైన ప్రజలందరూ ఆగస్టు 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోల్లపూడి కళ్యాణ్, అలవాల ఉపేందర్, అలవాల నరేష్, లింగం రవి, మామిడి సామెల్, బెంజిమెన్ మామిడి, నరసింహారావు, లక్ష్మణ్, యోహాన్, అనిల్, లింగం సైదమ్మ, కమలమ్మ, శామలమ్మ, షాహిన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి తల్లి మృతి పట్ల సంతాపం తెలిపిన కాటం వెంకటేశం

**చిట్యాల, ఆగస్టు 18 (జనం సాక్షి):**
చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్ మోర స్వామి తల్లి (85) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ ఓర్సు సైదులు, ఏర్పుల యాదయ్య, గంట రవీందర్ రెడ్డి, బుంగపట్ల తిమ్మయ్య, భైరవని బిక్షం, గుండెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్టుపై నిర్లక్ష్యం.. రైతులకు తీవ్ర నష్టం

## సీతమ్మ బ్యారేజీని వెంటనే పూర్తి చేయాలి: సీపీఎం



**అశ్వాపురం ఆగస్టు 18 (జనంసాక్షి):**
సీతమ్మసాగర్ బ్యారేజీతో పాటు సీతారామ ప్రాజెక్టు పనులను ప్రభుత్వం తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అశ్వాపురం మండలంలో సీపీఎం బృందం సీతమ్మసాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టు కాలువలు, పంప్‌హౌస్, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2026 ఆగస్టు 15 నాటికి నీరు అందిస్తామని ఇచ్చిన హామీ అమలుకాలేదని విమర్శించారు. ఆర్భాటపు ప్రకటనలకు పరిమితం కాకుండా ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. రూ.2 వేల కోట్లు కేటాయిస్తే 53 వేల ఎకరాలకు సాగునీరు, ప్రగళ్లపల్లి లిఫ్ట్ పూర్తయితే మరో 30 వేల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉందన్నారు. సీతారామ కాలువలను చెరువులు, ఫీల్డ్ చానల్స్‌తో అనుసంధానం చేస్తే సాగునీటి ప్రయోజనం మరింత విస్తరిస్తుందని పేర్కొన్నారు. మణుగూరు ప్రాంతంలో సుమారు 20 వేల ఎకరాలు, తుమ్మలచెరువు కింద సుమారు 8 వేల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉన్నప్పటికీ ఆలస్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నీరు వస్తుందని చెప్పడంతో రైతులు నార్లు పోసి, ప్రస్తుతం నీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. భూసేకరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అమ్మగారిపల్లి ప్రాంతంలో కోర్టు తీర్పు అనుకూలంగా ఉన్నప్పటికీ ఇంకా సుమారు 34?35 మంది నిర్వాసితులకు న్యాయం జరగాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు పూర్తితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి పనులను వేగవంతం చేయాలని, లేకుంటే ప్రాజెక్టు సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, అన్నవరపు కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై. విక్రం; జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, లిక్కి బాలరాజు, బండి పద్మ, ఎర్ర శ్రీనివాసరావు, మడిపల్లి గోపాలరావు, మెరుగు సత్యనారాయణ; జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, భూక్యా రమేష్, నిమ్మల వెంకన్న, మర్మం చంద్రయ్య, కొండబోయిన వెంకటేశ్వర్లు; మండల కార్యదర్శి పాయం నరసింహారావు; సీనియర్ నాయకులు సర్గం బాలనర్సయ్య, వాసిరెడ్డి వరప్రసాద్; కుమ్మరిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య; అశ్వాపురం మండల కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డి, శంబిరెడ్డి, సాంబశివరావు, దండి రాములు, మోకాళ్ల రమేష్, పాయం విజయ, బొడ్డు రాములు, బొమ్మరాతి రామయ్య, మోహన్‌రెడ్డి, నరసింహాచారి, పాయం జానకమ్మ; మణుగూరు మండల కమిటీ సభ్యులు కొడిశాల రాములు తదితరులు పాల్గొన్నారు.



## రేపు కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి: టియుసిఐ

**టేకులపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):**
ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు ఈనెల 20న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లి లారీ యూనియన్ ఆఫీస్ వద్ద మోటార్ వర్కర్స్ యూనియన్,బ్రాంచ్ అధ్యక్షులు గుగులోతు మధార్ అధ్యక్షతన జరిగింది ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టి యు సి ఐ) ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న మాట్లాడుతూ కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాల్సి ఉండగా అమలు చేయడం లేదని, ఒక కార్మికుడు పనిచేస్తే కార్మికుడి భార్య ఇద్దరు పిల్లలు కార్మికుడి తల్లిదండ్రి, మూడు యూనిట్లుగా లెక్కల ప్రకారం 30 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, కనీస వేతనం 26,000 వేల రూపాయలు కూడా చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుడు గౌరవ వేతనం కొరకు పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,2016లో తీర్పు నిచ్చిన, ఈ దేశంలో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్య మంత్రులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ సమావేశంలో రామ్ కోటి,కుంజ కోటేష్, అరేం మధు, మోకాళ్ళ సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 21న ఇల్లందు రూరల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

### విద్యుత్ శాఖ అధికారి సబ్ ఇంజనీర్ ఎస్.కె నాజిర్

**ఆళ్లపల్లి ఆగస్టు 18 (జనంసాక్షి) :** ఇల్లందులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక( సిజిఆర్ఎఫ్ - ఐ,టి ఎస్ ఎన్ పి డి సి ఎల్ ,వరంగల్) ఆధ్వర్యంలో ఈ నెల 21న విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు తేదీ: 21-08-2026 ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు ఇల్లందు రూరల్ సెక్షన్ కార్యాలయం వద్ద జరుగును ముఖాముఖి కార్యక్రమంలో వినియోగదారుల తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారులకు తెలియ చేసుకోవచ్చని, అక్కడికక్కడే పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సబ్ ఇంజనీర్ ఎస్.కె నాజిర్ మాట్లాడుతూ మండల ప్రజలు వినియోగదా రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## డాక్టరేట్ సాధించిన పి. జ్యోతి



**చంద్రుగొండ, ఆగస్టు 18 (జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం పరిశోధకురాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన పి. జ్యోతి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాకు అర్హత సాధించారు. తెలంగాణలోని నర్సంపేట, పాల్వంచ మండలాల్లో నేలలోని కీటకాలు, ఇతర సూక్ష్మజీవుల వైవిధ్యం, విస్తరణపై ఆమె పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వై. సునీల కుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, పీహెచ్‌డీ వైవా-వోస్‌లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. జ్యోతి భర్త డా. బి. శ్రీనివాస్ కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో 2024లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. భార్యాభర్తలిద్దరూ వేర్వేరు శాస్త్ర విభాగాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్లు సాధించడం విశేషం. ఈ సందర్భంగా డా. జ్యోతికి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, సహచరులు, గ్రామస్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.




## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### సీఐ వెంకటేశ్వరరావు

**పినపాక, ఆగస్టు18(జనం సాక్షి):**
పినపాక మండలం క్రాస్ రోడ్ నందు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉద్దేశంతో చేస్తున్న తనిఖీలలో భాగంగా ఏడుళ్ల బయ్యారం పోలీస్ లు డ్రగ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చిన యువకున్ని న్యాయస్థానం నుండి ఉత్తర్వులు తీసుకొని భద్రాచలం డి అడిక్షన్ సెంటర్ కి పంపించడం జరిగిందని బయ్యారం పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వరరావు పినపాక, కరకగూడెం మండలాల యువకులను ఉద్దేశించి మాట్లా డుతూ మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితం కూడా తీవ్రంగా ప్రభావితమవుతుందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా క్రీడలు, విద్య, ఉపాధి నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## పుల్లెల గాయత్రికి మాజీ మంత్రి అజయ్ కుమార్ అభినందనలు

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 18 (జనంసాక్షి)**
అర్జున అవార్డుకు ఎంపికైన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పుల్లెల గాయత్రికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. పిన్న వయసులోనే బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ అర్జున అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. పుల్లెల గాయత్రి సాధించిన ఈ ఘనత యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న గాయత్రి అంచెలంచెలుగా ఎదుగుతూ తన తండ్రి బాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కు తగ్గట్లుగా రాణిస్తోందని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# నీళ్లకు బదులు యాసిడ్ ఘటనపై సీహెచ్‌సీ వివరణ

## కడుపునొప్పితో వచ్చిన వృద్ధుడి ఘటనపై మర్రిగూడ సీహెచ్‌సీ స్పష్టీకరణ

**మర్రిగూడ, ఆగస్టు 18 (జనంసాక్షి)**
మర్రిగూడ గ్రామానికి చెందిన కురిమిళ్ల చంద్రయ్య (65) కడుపునొప్పితో ఆగస్టు 11న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ నాయక్ తెలిపారు. వైద్యులు పరీక్షించి మందులు రాసిన అనంతరం మందులు వేసుకునేందుకు చంద్రయ్య ఆసుపత్రి ఫోర్త్ క్లాస్ ఉద్యోగి శివను నీరు అడిగినట్లు చెప్పారు. శివ తన వద్ద వాటర్ బాటిల్ లేదని చెప్పడంతో చంద్రయ్య తన వెంట తెచ్చుకున్న బాటిల్‌ను ఇచ్చారని, ఆసుపత్రిలోని వాటర్ క్యాన్ నుంచి నీటిని నింపి ఆయనకు అందించినట్లు డాక్టర్ తెలిపారు. మందులు వేసుకుని నీరు తాగిన సుమారు 15 నిమిషాల తర్వాత చంద్రయ్య కడుపునొప్పి తీవ్రంగా ఉందని చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే చంద్రయ్య అంతకుముందు నాలుగు రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వస్తున్నారని డాక్టర్ శంకర్ నాయక్ వెల్లడించారు. హైదరాబాద్‌కు రిఫర్ చేసే సమయంలో ఆసుపత్రి సిబ్బంది అంబులెన్స్ ఏర్పాటు చేయగా, చంద్రయ్య భార్య వచ్చి అంబులెన్స్‌ను తిరిగి పంపించినట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు సరికావని, రోగికి అవసరమైన వైద్య సేవలు అందించామని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

### పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం

# హేయమైన చర్య

### మాజీ ఎంపీపీ, తాటికొండ సీతయ్య



**తుంగతుర్తి ఆగస్టు 18 (జనం సాక్షి)** నర్సంపేట మాజీ శాసన సభ్యులు తెలంగాణ ఉద్యమకారులు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం హేయమైన చర్య అని మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు, మంగళవారం పార్టీ కార్యాలయం లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కుట్రతో మున్సిపల్ అధికారులతో విగ్రహాన్ని తొలగింప చేయడం విచారకరమని అన్నారు. ఉద్యమకారులను గౌరవిస్తామని గొప్ప మాటలు చెప్పిన కాంగ్రెస్ పెద్దలు ఇలాంటి పనులకు పూనుకోవడం. అనైతిక చర్య అని అన్నారు, కావాలని బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ అధికారులు యధా స్థానంలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాకా తప్పదని అన్నారు. ఈ సమావేశం లో జిల్లానాయకులు గుండాగాని రాములు గౌడ్. తునికి సాయిలు గౌడ పాల్గొన్నారు.

### బహుజనుల హక్కుల కోసం

## పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

### జిల్లా ఎస్పీ నరసింహ

మంగళవారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు అండగా నిలిచి తన పోరాట పటిమతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు పాపన్న గౌడ్ అని ఆయన చూపిన ధైర్యం ఆత్మగౌరవం పోరాట స్ఫూర్తి నీటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు, బహుజనుల సోదరులందరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని అన్నారు, సమాజంలో ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉండి శాంతియుతంగా జీవించినప్పుడే ఆయనకు మనం అర్పించిన నిజమైన నివాళులని అన్నారు, సమాజంలో జరిగే చిన్న చిన్న విషయాలకు పట్టింపులకు పోకుండా సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు ఉండాలని అన్నారు, సమాజంలో ఏమైనా వ్యక్తుల మధ్య చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు పెద్దమనుషుల సమక్షంలో గాని పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు చేసుకొని పరిష్కరించుకోవచ్చని అన్నారు, అన్ని వర్గాల వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి ప్రసన్న కుమార్, ఎస్సైలు క్రాంతి కుమార్, వీరన్న, నాగరాజు, సర్దార్ సర్వాయి పాపన్న సంఘం ప్రతినిధులు గుండె గాని రాములు గౌడ్, తునికి సాయిలు, పులుసు వెంకట్ నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, సర్పంచ్ కోరి కొప్పుల నరేష్ గౌడ్, గోపగాని రమేష్ గౌడ్, పులుసు వెంకన్న, గడ్డం ఉప్పలయ్య, గుండ గాని శ్రీనివాస్, గుండ గాని అంజయ్య, కట్ల మల్లయ్య, తాళ్ల పెల్లి యాదగిరి, సిగ నరేష్, బొంబగాని వెంకన్న, వర్ధిల్లు లింగయ్య, గుండె గాని రాము, బింగి వెంకటేశ్వర్లు, బింగి సోమయ్య తో పాటు స్థానిక నాయకులు బహుజన నాయకులు పాల్గొన్నారు.

### జిల్లా కేంద్రంలో

## పోలీసుల విస్తృత తనిఖీలు



**సూర్యాపేట (జనంసాక్షి):** డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల నిరోధించడంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది రాజీవ్ నగర్, మెయిన్ రోడ్, బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న టీ దుకాణాలు, పాన్ షాప్స్, విద్యాసంస్థల నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు.రెండు తెలుగు రాష్ట్రాలని కలుపుతూ ప్రధాన జాతీయ రహదారిపై రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించడం, డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా నిరోధించడం, కొత్త వ్యక్తుల కదలికలు గుర్తించడంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.గంజాయి, డ్రగ్స్ లాంటి పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను గుర్తించే డాగ్ నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తనిఖీల్లో పాల్గొని పాన్ డబ్బాలు, టీ దుకాణాలు, అనుమానిత వస్తువులను తనిఖీ చేసింది.




## మేళ్లచెరువులో సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష ప్రారంభం

**మేళ్లచెరువు జనంసాక్షి**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మేళ్లచెరువు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.దీక్షను ప్రారంభించిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వట్టెపు సైదులుమాట్లాడుతూ, రాష్ట్రంలోని గ్రామపంచాయతీలలో వేలాది మంది గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, అంటువ్యాధులు రాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సేవలు అందిస్తున్నారని అన్నారు.ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనం, భవిష్య నిధి, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులందరినీ శాశ్వతం చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్రామాల్లో సర్పంచులు, రాజకీయ నాయకుల వేధింపులకు గురవుతున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### అత్యవసర సాగు ప్రణాళిక పై

# రైతులకు అవగాహన

ఆత్మకూరు (ఎం) జనం సాక్షి ఆగస్టు (18)

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు అత్యవసర సాగు ప్రణాళిక రూపొందించుకొని, తక్కువ నీటి అవసరం కలిగిన, కరువును తట్టుకునే స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. అశోక్ కుమార్ సూచించారు. మండలం లో ని పల్లెర్ల గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వర్షపాతం అనిశ్చితంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నేల తేమను సద్వినియోగం చేసుకొని కంది, అలసంద, పెసర, ఉలవలు వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఆయా పంటల్లో కరువును తట్టుకోగల స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని తెలిపారు.అలాగే, అందుబాటులో ఉన్న నేలతేమను సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా పంటను బట్టి సిఫార్సు చేసిన తక్కువ విత్తన దూరం/సరైన మొక్కల సాంద్రతతో విత్తుకోవడం ద్వారా వర్షాధార పంటల్లో మెరుగైన దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. విత్తన ఎంపిక, విత్తే సమయం, నేలతేమకు అనుగుణంగా పంట ఎంపిక వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.అలాగే ఈ కార్యక్రమంలో డీలర్ షాపుల ద్వారా ఎరువుల బుకింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్-ఫెర్టిలైజర్) యాప్పై రైతులకు ప్రాథమిక అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలని తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోని 315 మంది రైతుల జాబితాను గ్రామపంచాయతీ వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. సంబంధిత రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మంజుల, నవనితతో పాటు రైతులు ఎ. కృష్ణ, వి. అంజయ్య, ఎ. నాగేశ్వర్ రెడ్డి, జక్కుల సంధ్య, డి. మంజుల తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

**ప్రతిపక్ష నేతలు హైకోర్టు స్టేను రాజకీయం చేస్తున్నారు**

**సంక్షేమ పథకాలను నిలిపివేసే ప్రసక్తే లేదు**

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు**



**కొండమల్లేపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):** తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం రద్దు చేస్తుందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కొండమల్లేపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను రద్దు చేసేందుకు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం చట్టపరమైన అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాల అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక ప్రకటన చేసిందన్నారు. ఈ పథకాలపై విధించిన స్టేను తొలగించేందుకు త్వరలోనే హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన లోపభూయిష్టమైన ఉత్తర్వుల వల్లే ప్రస్తుత న్యాయపరమైన చిక్కులు తలెత్తాయని త్వరలోనే అన్ని పొరపాట్లను సరిదిద్ది పథకాలను కొనసాగిస్తామని అయన తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి గతంలో జారీ చేసిన 8 జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ (డబ్ల్యూ.పి. నంబర్ 21732/2026)పై విచారణ జరిపిన హైకోర్టు 12.08.2026న మధ్యంతర ఆదేశాలు జారీ చేసిందన్నారు. 09.09.2026 వరకు ఈ పథకాలపై స్టే విధిస్తున్నట్లు పేర్కొందన్నారు. న్యాయస్థానం ఆదేశాలను గౌరవిస్తూనే పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా ఈ పథకాల రాజ్యాంగబద్ధతను అవసరాన్ని కోర్టుకు వివరిస్తామని ప్రభుత్వం తెలిపిందని అన్నారు. 2014లో పథకాన్ని ప్రారంభించిన సమయంలో అప్పటి ప్రభుత్వం సరైన నిబంధనలతో జీవోలు ఇవ్వలేదని అందుకే ఇప్పుడు సాంకేతిక ఆధారాలతో కోర్టులో పిటిషన్లు పడ్డాయని అయన విమర్శించారు. ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే అధికారుల లోపమా లేదా విభాగా ధిపతుల అలసత్వమా అనే కోణంలో విచా రణ జరుపుతున్నామని బాధ్యులైన వారిపై కఠిన మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు తెలుపుతుందని పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుందని అదే సమయంలో ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా పథకాల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత, ప్రజా ప్రయోజనాన్ని వివరించిందని అని అన్నారు. ప్రజలు నిరాధారమైన వదంతులను, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు అయన సూచించారు.

# నూతన జంటకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

**గుర్రంపోడు: ఆగస్టు 18 (జనంసాక్షి)**

నాగోలులోని శుభం ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య కుమారుడు సాయిరాం, మౌనికల నిశ్చితార్థ వేడుక సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాత్రి 9 గంటల సమయంలో జరిగిన ఈ శుభకార్యానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శుభం ఫంక్షన్ హాల్‌లో సందడి నెలకొంది. నూతన వధూవరులు సాయిరాం, మౌనికలను పలువురు ప్రముఖులు, నాయకులు కలిసి అభినందించి ఆశీర్వదించారు. వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని, దంపతులుగా మంచి జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఏనుగుల రాకేష్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, రామచంద్రనాయక్ హాజరై నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు (పీజీఆర్) పాశం వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మునికుంట్ల రాజేష్ రెడ్డి, ఎల్.ఎన్. రెడ్డి తదితర ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కడారి అంజయ్య కుటుంబానికి ఆత్మీయంగా ఉండే నాయకులు, సన్నిహితులు, బంధువులు ఈ శుభకార్యానికి హాజరై కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కోలాహలం మధ్య నిశ్చితార్థ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కడారి అంజయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుమారుడు సాయిరాం, మౌనికల నిశ్చితార్థ వేడుకకు విచ్చేసి నూతన జంటను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఏనుగుల రాకేష్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, రామచంద్రనాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ పాశం వేణుగోపాల్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఎల్.ఎన్.రెడ్డి తదితర నాయకులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో జరిగిన ఈ నిశ్చితార్థ వేడుక ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. నూతన వధూవరులు సాయిరాం, మౌనికలకు పలువురు శుభాకాంక్షలు తెలియజేయడంతో శుభం ఫంక్షన్ హాల్‌లో సందడి వాతావరణం నెలకొంది.





## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజా బాట

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):**

గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజా బాట నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట డివిజన్ టీజీఎస్ పీడీసీఎల్ డీఈ నిమ్మ వెంకటకిష్టయ్య చెప్పారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం మంగళవారం గ్రామం లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు ఇందిరసోమరాజు, ఏడీఈ ఎల్. శ్రీనివాస్, ఏఈ వాస శ్రీకాంత్, వార్డు సభ్యులు బొల్లం ప్రభాకర్, లైన్ ఇన్ స్పెక్టర్ సిహెచ్. పాల్ రాజ్ , ప్రభాకర్, లైన్ మెన్ చిప్పలపల్లి నాగార్జున, వీరభద్రయ్య, శ్యామ్ సుందర్‌రెడ్డి, సతీష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జేఎల్ఎమ్ లు, ఏఎల్ ఏం లు, సిబ్బంది పాల్గొన్నారు.



## విబిజిరామ్ జి పథకం పై అవగాహన

**నేరేడుచర్ల ఆగస్టు 18(జనంసాక్షి):**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విబిజిరామ్ జి, పథకంలో భాగంగా ఫామ్ పాండ్స్ (పంట కుంటలు), గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక చేయుటకు గాను అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జాయింట్ కమిషనర్ నర్సింహులు పాల్గొని ముకుందపురం గ్రామ పంచాయతీ సందర్శించి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయుటకు సూచనలు, సలహాలు చేశారు. గ్రామంలో పర్యటించి పారిశుద్యం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ నర్సింహులు మాట్లాడుతూ పంట కుంటల ప్రాధాన్యత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు మరియు వ్యవసాయానికి పంట కుంటల ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష,డీపీఓ యాదగిరి, ఎంపీడీఓ సోమ సుందర్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్,అగ్రికల్చర్ ఆఫీసర్ , సీసీలు, ఏపీఎం లు, ఎంపీవో నాగరాజు, ఏపీఓ శేఖర్,పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు మట్టి కుండలోనే బోనం సమర్పించాలి

### మట్టి కుండలో బోనం తీయడం ఆచారం మాత్రమే కాదు ఆరోగ్యం రుచి భక్తి కలిపి ఉంటాయి

### కుమ్మరి శాలివాహన సంఘం మండల అధ్యక్షులు ఏరుకొండ రాము



**కొండమల్లేపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):**

ప్రస్తుత శ్రావణమాసంలో భక్తులు గ్రామాలలో గ్రామ దేవతలకు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఈ సమయంలో బోనాలు మట్టి పాత్రలోనే తీయాలని కొండమల్లేపల్లి మండల కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు ఏరుకొండ రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పాత్రలో బోనం అంటే ఆచారం మాత్రమే కాదని ఆరోగ్యం రుచి భక్తి కలిగి ఉన్నది అని మట్టి పాత్ర గొప్పతనాన్ని తెలియజేశారు. తెలంగాణ సంప్రదాయంలో బోనాల పండుగలో మట్టి కుండకే చాలా ప్రత్యేకత ఉందని. అమ్మవారికి గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించడానికి మట్టి కుండనే ఎక్కువగా వాడతారు అని ఆయన అన్నారు. మట్టి కుండలో వండిన అన్నం, పాలు, బెల్లం ఎక్కువసేపు చల్లగా ఉంటాయని. వేడికి తట్టుకొని నెమ్మదిగా ఉడుకుతుంది కాబట్టి పోషకాలు నశించవు అని తెలిపారు. మట్టిలో సహజంగా క్షార గుణం ఉంటుందని దీనివల్ల ఆమ్లత్వం తగ్గి అన్నం తేలికగా జీర్ణమవుతుందని ఆయన అన్నారు. కుండ నుండి కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి సూక్ష్మపోషకాలు ఆహారంలోకి కలుస్తాయని తెలియజేశారు. రసాయన రహితంగా ఉండడం వల్ల అమ్మవారికి స్వచ్ఛమైన నైవేద్యం అవుతుంది దీంతో అమ్మవారి అనుగ్రహం పొందవచ్చు అన్నారు. మట్టి కుండలో ఉడికించడం వల్ల బోనానికి ఒక ప్రత్యేకమైన మట్టి వాసన, రుచి వస్తుందని అదే అసలైన రుచికరమైన బోనం అన్నారు. మట్టి కుండలో ఆహార పదార్థాలు ఉడికించేటప్పుడు వేడి సమానంగా పంపిణీ అవుతుందని, అందుకే అన్నం, పాలు మాడకుండా చిక్కగా వస్తాయి అన్నారు. భక్తుల నమ్మకం ప్రకారం మట్టి కుండలో సమర్పించిన బోనాన్ని అమ్మవారు త్వరగా స్వీకరిస్తుందని, కోరికలు తీరుస్తాయని తరతరాలుగా నమ్మకం ఉంది అన్నారు. మట్టి సహజమైనది, పవిత్రమైనది. అందుకే దేవతా పూజల్లో మట్టి కుండకే మొదటి స్థానం ఉందని ఆయన గర్వంగా కలిపారు. ఒకసారి వాడిన కుండను నిమజ్జనం చేయడం వల్ల భూమిలో కలిసిపోతుందని ఎలాంటి కాలుష్యం ఏర్పడదని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బోనం ఊరేగింపులో ప్రతి ఇంటి నుండి మట్టి కుండలో బోనం తీసుకురావడం వల్ల ఊరంతా ఒకే కుటుంబంలా కనుల పండగగా కనిపిస్తుందన్నారు. పూర్వం ప్రజలందరూ వంటలకు మట్టి పాత్రలనే వాడేవారని నీటిని నిలువ చేయడానికి తినే పాత్రలను సహితం మట్టి పాత్రలనే వాడేవారు అని అందుకే వారు వంద సంవత్సరాలకు పైగా ఆరోగ్యంగా జీవించారని అన్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ తదితర పాత్రలలో ఆహార పదార్థాలు నిలువ చేయడం వంట చేయడం తినడం చేస్తుండడం వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు గ్రహించి సంప్రదాయంతో పాటు ఆరోగ్యం కూడా దాగి ఉన్న మట్టి పాత్రలనే వాడాలని ఆయన సూచించారు.

## వెంటనే రోడ్డు పై గుంతలను పూడ్చండి : బిజెపి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం

**వలిగొండ, ఆగస్టు 18( జనంసాక్షి )**

భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో గుంతల మాయమైన రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట లోతైన గుంటలు ఏర్పడి, ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాలకి గురవుతున్నారని. అందుకు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి రోడ్డు మీద పడిన గుంటలను వెంటనే పనులు చేపట్టాలని, లేనియెడల సంబంధిత శాఖ అధికారుల కార్యాలయాల వద్ద భారతీయ జనతా పార్టీ ముట్టడి చేపడుతుందని, అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ముట్టడిస్తామని వారు ఎమ్మెల్యే కి, స్థానిక అధికారులను హెచ్చరించారు. తక్షణమే ఈ రోడ్డుపై ఏర్పడిన గుంటలను పూడ్చని యెడల భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ తరఫున పెద్ద కార్యక్రమాన్ని తీసుకొని అడుగడుగునా ఎమ్మెల్యే ని అడ్డుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, సీనియర్ నాయకులు



నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రాస వెంకట్,బచ్చు శ్రీనివాస్, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్ , కందుల తానేష, మంద నరసింహ, రావుల పద్మారెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, రంజిత్ రెడ్డి, దయాకర్, వెంకటేష్, శ్రీనివాస్, మహేష్ ,మండల నాయకులు వెంకటేష్, ఎర్రవోలు జంగయ్య, అరుణ్, మచ్చగిరి, అశోక్, లింగస్వామి వివిధ గ్రామాల నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

## క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు

**మర్రిగూడ,ఆగస్టు 18 (జనంసాక్షి)**




మర్రిగూడ మండలంలోని కుదబక్షిపల్లి గ్రామంలో బేతెల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలోని ట్యూషన్ కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జిల్లా తిరుమలేష్,ఉపాధ్యాయులు బూడిద కృష్ణయ్య, జ్యోతి, విజయ, బూడిద జీవన్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.